సాక్షి ఖమ్మం

సోమవారం । 15 । జనవరి । 2024



ఇక అన్నీ మెయిన్!

ఉమ్మడి జిల్లాలోని 861 మినీ అంగన్ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయడంతో అన్నీ మెయిన్ సెంటర్లుగా మారినట్లయింది. 8లో



బూడిదవుతున్న బొగ్గు

పాల్వంచ కేటీపీఎస్‌లోని కోల్ ప్లాంట్‌పై అధికారుల పర్యవేక్షణ కరువై నిల్వ చేసిన బొగ్గు నిత్యం ఆహుతవుతోంది. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 18°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఉదయం, రాత్రి చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

మంత్రుల సంక్రాంతి శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలుగింట పెద్ద పండుగ అయిన సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలంతా సంబురంగా జరుపుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఈమేరకు వారు వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా శుభాకాంక్షలు చెబుతూ ప్రకటనలు విడుదల చేశారు.

నేడు జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరనున్న ఆయన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మీదుగా 11.30 గంటలకు మధిర చేరుకుంటారు. మధిరలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొనే భట్టి ఇక్కడే బస చేస్తారు. మంగళవారం ఉదయం తిరిగి హైదరాబాద్ బయలుదేరతారు.

నేటి నుండి కేంద్ర మంత్రి పర్యటన

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, కోఆపరేటివ్ శాఖ మంత్రి బీఎల్.వర్మ సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పర్యటన వివరాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ వెల్లడించారు. కేంద్రమంత్రి సోమవారం మధ్యాహ్నం ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్‌నగర్‌లోని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం రాథోడ్ ఇంటికి వెళ్లి ఆతర్వాత రఘునాధపాలెం మండలం చిమ్మపుడిలో జరిగే వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్తారు. అక్కడ మంగళవారం జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నాక సాయంత్రం ఖమ్మం చేరుకుని బస చేస్తారు. ఇక బుధవారం ఉదయం ఖమ్మం త్రీటౌన్‌లోని రంగనాయకుల స్వామిని దర్శించుకున్నాక మీడియాతో మాట్లాడతారు. అనంతరం బోనకల్ మండలం రావినూతల, మధిర మండలం మల్లారంలో జరిగే వికసిత్ భారత్ కార్యక్రమాల్లో పాల్గొని హైదరాబాద్ బయలు దేరతారు.

రాహుల్ యాత్రకు సంఘీభావ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్ర ఆదివారం ప్రారంభం కాగా.. అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కోరారు. రాహుల్ యాత్రకు సంఘీభావంగా ఖమ్మంలో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యాత్ర ఉద్దేశాలను వివరించారు. నాయకులు ఎం.డీ. జావీద్, నాగండ్ల దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం

రామాలయంలో భక్తుల రద్దీ



గోదాకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో భోగి పండుగను పురస్కరించుకుని గోదా-రంగనాథ స్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు అంతరాలయంలో పూజలు జరిపించాక మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి బేడా మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లను కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సంక్రాంతి సెలవులు కావడంతో దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వామి వారి దర్శనానికి బారులుదీరారు. పాపికొండల పర్యాటకానికి సైతం పెద్ద ఎత్తున తరలిరావడంతో భద్రాచలంలో సందడి నెలకొంది.

భోగి భాగ్యం



ఖమ్మంలో భోగి మంట చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు, చిన్నారులు

- ఇళ్ల ఎదుట పరుచుకున్న రంగవల్లులు
- పిల్లలకు భోగి పండ్లతో వేడుక
- పతంగులతో సరదాగా పిల్లలు, యువత
- ఆలయాల్లో గోదారంగనాథుల కల్యాణం

నేడు మకర సంక్రాంతి



బసవన్నకు నమస్కరిస్తున్న యువతి

భోగభాగ్యాలను అందించే భోగి పండుగను ఆదివారం జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఉత్సవాలను ప్రారంభించారు. సూర్యోదయానికి ముందే పల్లెపట్నం తేడా లేకుండా కాలనీలు, వీధుల్లో భోగి మంటలు వేశారు. పాతకు స్వస్తి పలికి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ ఆనందంగా గడిపారు. పలుచోట్ల డీజేలు ఏర్పాటుచేసి సంప్రదాయ పాటలకు నృత్యాలు చేశారు.

– ఖమ్మంగాంధీచౌక్



ఇంటిముందు ముగ్గులో రంగులు అద్దుతున్న మహిళలు

కొత్త అందం తీసుకొచ్చిన రంగవల్లులు

మహిళలు భోగి ఉట్టిపడేలా ఇళ్ల ఎదుట వివిధ వర్ణాలతో ముగ్గులు తీర్చిదిద్దారు. పలుచోట్ల అర్ధరాత్రి నుంచే ముగ్గులు వేయడం ప్రారంభించారు. భోగి మంట, పాల పొంగు, హరిదాసులను ముగ్గుల్లో చేర్చారు. అలాగే, సాయంత్రం సంప్రదాయ రీతిలో పిల్లలపై భోగిపండ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. పలు ఆలయాల్లో గోదారంగనాథుల కల్యాణం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గొబ్బెమ్మలో నవధాన్యాలు వేస్తున్న మహిళలు

పతంగులతో సందడి



పతంగులు ఎగురవేస్తున్న పిల్లలు

పిల్లలు, యువత పతంగులతో సందడి చేస్తున్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ కనిపించారు.రహదారుల వెంట, భవనాలపైన, మైదానాల్లో పతంగులను ఎగురవేయడంలో పోటీపడ్డారు.


నేడు మకర సంక్రాంతి

సూర్యుడు సోమవారం మకర రాశిలోకి ప్రవేశించనున్నాడు. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని సంక్రమణం అంటారు. సూర్యుడు మకర రాశిలోకి సంక్రమించిన రోజు మకర సంక్రాంతిని జరుపుకోవడం ఆనవాయితీ. ఈమేరకు ప్రజలు పండుగను ఉత్సాహంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ కావడం, కొత్త పంటలు ఇళ్లకు చేరడంతో అన్నదాతలు సంబురంగా పండుగ జరుపుకోనున్నారు. ఏ ఇంట చూసినా అరిసెలు, సకినాలు తదితర పిండివంటలు సిద్ధమయ్యాయి.

కోళ్ల పందేలకు చలోచలో

జిల్లా ఏపీ సరిహద్దుగా ఉండడంతో పలు ప్రాంతాల్లో జరిగే కోడి పందేలను తిలకించేందుకు ప్రజలు భారీగా వెళ్లారు. ప్రత్యేకంగా వాహనాలు మాట్లాడుకుని బయలుదేరారు. ఇందులో పలువురు పందేలను చూసేందుకు వెళ్తున్నామని చెప్పగా చాలా మంది మాత్రం పందేలు కాసేందుకు వెళ్లినట్లు తెలిసింది.

సం'క్రాంతి' నిండాలి..



- ఈ ఏడాది వెలుగులపై ఆకాంక్ష
- ఆరు గ్యారంటీలపై ప్రజల్లో ఆశలు
- ఉద్యోగాల కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు
- వరుణుడిపై భారం వేస్తున్న అన్నదాతలు

ఖమ్మంగాంధీచౌక్: సంక్రాంతి అంటేనే నూతన క్రాంతి. అయితే, ఈ సంక్రాంతి తమ జీవితాల్లో కాంతులు నింపాలని అన్ని వర్గాల ప్రజలు ఆశిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో పాటు అకాల వర్షాలు, తుపాన్‌తో రైతులు పంటలను నష్టపోయారు. ఇక రబీలో ఆశించిన స్థాయిలో భూగర్భజలాలు లేక పంటలు లక్ష్యం మేర సాగయ్యే పరిస్థితి కనిపించక అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. అలాగే, ఉద్యోగ, ఉపాధి కోసం నిరుద్యోగులు ఏళ్లుగా ఎదురుచూపుల్లో గడుపుతున్నారు. మరోపక్క సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ఇటీవల ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు స్వీకరించిన నేపథ్యాన త్వరలోనే తమకు ఫలాలు అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. సూర్యుడు మకరంలోకి చేరుతూ వెలుగులను విరజిమ్మే కాలం నుంచి తమ జీవితాల్లోనూ వెలుగులు ప్రసరించాలని అంతా కోరుకుంటున్నారు. కష్టనష్టాలు, ఒడిదుడుకుల మధ్య సాగిన బతుకులు ఈ పండుగ నుంచి మారాలని కోటి ఆశలతో ఆకాంక్షిస్తున్నారు.

ఉద్యోగంపైనే కోటి ఆశలు



కాంతిని విరజిమ్మే కాలం సంక్రాంతి నుంచే ఆరంభమవుతుంది. ఈ కాలం జీవితాల్లో కాంతులు నింపాలని అన్నివర్గాల ప్రజల ఆశిస్తున్నారు. నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఆశలు పెట్టుకున్నారు. ఇకనుంచి ఉద్యోగాల భర్తీ జరుగుతుందనే భావనతో ఉన్నాం.

– కె.వెంకట్, ఎం.ఏ., ఖమ్మం

సిరిసంపదలు నిండాలి



కాంతివంతమైన జీవితం దక్కాలని, సిరిసంపదలతో తులతూగాలని కోరుతూ సంక్రాంతి జరుపుకుంటున్నాం. రైతులు పాడి పంటలతో విరాజిల్లితేనే అంతా బాగుంటుంది. ఈ సంక్రాంతి ప్రజలకు కొత్త కాంతులు ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం.

– ఆమంచి సురేష్ శర్మ, అర్చకులు, ఖమ్మం

పాడిపంటలు సమృద్ధిగా ఉండాలి..



వానలు లేక ఖరీఫ్‌లో పంటల దిగుబడి రాలేదు. ఇక యాసంగిలో సాగు గణనీయంగా పడిపోయింది. దీంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. వచ్చే సీజన్‌లోనైనా వానలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాం.

– కాంపాటి శ్రీనివాసరావు, రైతు, ఎదుళ్లచెరవు, తిరుమలాయపాలెం మండలం

ప్రభుత్వ పథకాలు దరిచేరాలి



రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్నా. మహాలక్ష్మి పథకం కింద ఈ ఏడాది నుంచే నెలకు రూ.2,500 అందుతాయని ఆశిస్తున్నా. ఉచిత విద్యుత్ సౌకర్యం కూడా అందాలని నాలాంటి ఎందరో కోరుకుంటున్నారు.

– పాలపిందెల సరోజన, గృహిణి, పోచారం, కూసుమంచి మండలం

సమస్యలు పరిష్కారం కావాలి



సూర్యుడు మకర సంక్రమణంలోకి చేరడంతో అంతా కాంతివంతమవుతుంది. ఆ కాంతి అందరి జీవితాల్లోనూ నిండాలి. ఉద్యోగులకు సంబంధించి పీఆర్‌సీ, డీఏ వంటి సమస్యలు పరిష్కారం కావడమే కాక రైతులు పాడిపంటలతో విరాజిల్లాలని కోరుకుంటున్నాం.

– తాడేపల్లి కిరణ్‌కుమార్, వ్యవసాయ మార్కెట్ ఉద్యోగి, ఖమ్మం

ఉద్యోగం సిద్ధించాలని వేడుకుంటున్నా..



సంక్రాంతి లోకానికి కొత్త వెలుగులు ఇవ్వడమే కాక నాకు కొత్త జీవితాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నా. బీటెక్ పూర్తి చేసి రెండేళ్లయింది. ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేవు. ఇప్పుడైనా ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇస్తే నాలాంటి వారికి మేలు జరుగుతుంది.

– మారగాని మహతి, బీటెక్, ఖమ్మం

కిక్కిరిసిన బస్టాండ్లు

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. అయినప్పటికీ పండుగకు అంతా ఒకేసారి స్వస్థలాలకు బయలుదేరడంతో ఖమ్మం రీజియన్‌లోని అన్ని బస్టాండ్లు ఆదివారం కిటకిటలాడుతూ కనిపించాయి. హైదరాబాద్ నుండి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 66 రిజర్వేషన్ సర్వీసులు, 220 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడిపిస్తున్నారు. మొత్తం ప్రత్యేక సర్వీసుల్లో అత్యధికంగా హైదరాబాద్ రూట్‌కు కేటాయించినప్పటికీ రద్దీ కొనసాగింది. ఇక మహాలక్ష్మి పథకంతో ఈసారి మహిళా ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను ఆశ్రయిస్తుండగా ఆ బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంది. వీటికి తోడు సూపర్ లగ్జరీ, రాజధాని బస్సుల్లోనూ 100శాతం ఓఆర్ నమోదవుతోందని అధికారులు వెల్లడించారు. కాగా, బస్సుల్లో రద్దీ సోమ, మంగళవారాల్లో కాస్త తగ్గే అవకాశముండగా.. మళ్లీ బుధవారం నుంచి తిరుగు పయనమయ్యే వారితో బస్సులన్నీ కిటకిటలాడనున్నాయి.



ఖమ్మం పాత బస్టాండ్‌లో వేచిఉన్న మహిళలు



మినీ కాదు.. ఇక అన్నీ మెయిన్!

- అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్
- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 861 కేంద్రాలకు అవకాశం



మినీ అంగన్‌వాడీ టీచర్లకు ఉత్తర్వులు అందచేస్తున్న సత్తుపల్లి సీడీపీఓ కొండమ్మ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ చర్యలు చేపట్టింది. దీంతో ఏళ్ల తరబడి మినీ అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణకు మోక్షం లభించినట్లయింది. ఖమ్మం 235 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 626 కేంద్రాలు కలిపి ఉమ్మడి జిల్లాలో 861 కేంద్రాలకు ఈ అవకాశం లభించింది. ఇప్పటివరకు మినీ కేంద్రాల్లో ఒక్కరే టీచర్ ఉండగా ఆయా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, పర్యవేక్షణలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ఈ మినీ అంగన్‌వాడీ టీచర్లకు ఓటర్ల జాబితా విధులు, పల్స్‌పోలియో విధులు కేటాయించినప్పుడు ఆయా కేంద్రాలను మూసివేయాల్సిన పరిస్థితి ఉండేది. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా మారడంతో టీచర్‌తో పాటు ఆయా పోస్టులు కూడా మంజూరు కానున్నాయి.

పెరగనున్న వేతనం

ఇప్పటివరకు మినీ అంగన్‌వాడీ టీచర్లకు రూ.7,800 వేతనం అందుతోంది. ప్రస్తుతం మెయిన్ సెంటర్‌గా మారడంతో రూ.13,650 వేతనం లభించనుంది. అంతేకాకుండా అదనంగా ఆయా పోస్టులు సైతం మంజూరవుతాయి. కాగా, ఉమ్మడి జిల్లాలోని టేకులపల్లి ప్రాజెక్టుపరిధిలో అత్యధికంగా 104 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కాగా, తక్కువగా సత్తుపల్లి మండలంలో 11కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి.

ఉత్తర్వులు అందజేశాం..



జిల్లాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈమేరకు ప్రభుత్వం నుంచి అందిన ఉత్తర్వులను ప్రాజెక్టు అధికారుల ద్వారా కేంద్రాల టీచర్లకు పంపిణీ చేశాం. ఈ నిర్ణయంతో లబ్ధిదారులకు ఐసీడీఎస్ సేవలు మరింత మెరుగుపడే అవకాశం ఏర్పడుతుంది.

– టి.సుమ, జిల్లా సంక్షేమాధికారి

పెరగనున్న పర్యవేక్షణ



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఖమ్మం జిల్లాలో తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, ఖమ్మం అర్బన్, కామేపల్లి, మధిర, కల్లూరు, సత్తుపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ జిల్లాలో ప్రస్తుతం 1,605 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్ కావడంతో వీటి సంఖ్య 1,840కు చేరింది. ఆయా కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలు 37,912 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 19,747 మంది, గర్భిణులు 7,762 మంది, బాలింతలు 7,626 మంది ఉన్నారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. తాజాగా 626 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో వీటి సంఖ్య 2,686కు చేరింది. కాగా, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై మరింత పర్యవేక్షణ పెరగనుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని మూడు నుంచి ఆరు ఏళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో బోధిస్తున్నారు. ప్రతీ కేంద్రంలో ఒక టీచర్, ఆయా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఆట వస్తువులు, ఆహ్లాదం నింపేందుకు సామాగ్రిని సమకూరుస్తున్నారు. అలాగే, బలహీనంగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ప్రాజెక్టుల వారీగా అప్‌గ్రేడ్ అయిన కేంద్రాలు

ప్రాజెక్టు	కేంద్రాలు
టేకులపల్లి	104
పాల్వంచ	73
దమ్మపేట	72
చండ్రుగొండ	66
ఇల్లెందు	63
దుమ్ముగూడెం	55
తిరుమలాయపాలెం	54
మణుగూరు	52
కామేపల్లి	48
ఖమ్మంరూరల్	43
అశ్వారావుపేట	37
బూర్గంపహాడ్	37
కల్లూరు	35
కొత్తగూడెం	34
చర్ల	33
మధిర	23
ఖమ్మం అర్బన్	21
సత్తుపల్లి	11
మొత్తం	861

మార్కెట్లకు త్వరలోనే కొత్త కమిటీలు

- రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగించే అవకాశం?
- ప్రస్తుత పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్ కమిటీలను కొత్త పాలకవర్గాలను త్వరలోనే నియమించే అవకాశముందని తెలుస్తోంది. గతంలో ఉన్న రిజర్వేషన్లనే కొనసాగిస్తూ నియామకాలు చేపట్టనుందని సమాచారం. కాగా, ప్రస్తుత కమిటీలను రద్దు చేస్తూ శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. ఈమేరకు ఉత్తర్వులను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు కమిటీ ప్రతినిధులకు పంపించారు. తొలిదశగా రాష్ట్రంలోని 30 మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రద్దు చేయగా, మిగిలిన వాటిని సైతం త్వరలోనే రద్దు చేసే అవకాశముందని సమాచారం. పాలకవర్గాల స్థానంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాకారులను పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తున్నారు. ఖమ్మం మార్కెట్‌కు మార్కెటింగ్ శాఖ వరంగల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశంను నియమించారు.

ఆటంకం ఎదురుకాకుండా..

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ఇప్పటికే కొనసాగుతున్న నామినేటెడ్ పదవులను రద్దు చేస్తోంది. అందులో భాగంగా మార్కెట్ల కమిటీలనూ రద్దు చేసింది. ఇప్పటికే 30 కమిటీలను రద్దు చేయగా, ఆయా మార్కెట్లకు నూతన కమిటీలను నియమించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. తొలుత రాష్ట్రంలో ప్రాధాన్యత కలిగిన, లావాదేవీలు ఎక్కువగా జరిగే మార్కెట్లకు కమిటీలను నియమించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పంట ఉత్పత్తులు ఎక్కువగా వచ్చే అవకాశమున్నందున నిర్వహణలో క్రమవిక్రయాల్లో సమస్యలు రాకుండా కమిటీలను నియమించాల్సిన అవసరముంది. దీంతో ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

అవే రిజర్వేషన్లు..

గత ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్ విధానాన్ని ఖరారు చేసింది. అదే విధానాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించే అకాశాశముందని సమాచారం. రద్దు పరిచిన కమిటీల స్థానంలో పాత రిజర్వేషన్ల ప్రకారమే నూతన కమిటీలను నామినేట్ చేస్తారని చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన మార్కెట్ రిజర్వేషన్లపై ఎలాంటి మార్పు చేయకపోవచ్చని తెలిసింది. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, వైరా, నేలకొండపల్లి, మద్దులపల్లి, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు మార్కెట్లు ఉన్నాయి. ఇక భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, బూర్గంపాడు, భద్రాచలం, చర్ల, దమ్మపేట మార్కెట్లు ఉన్నాయి. కాగా, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, భద్రాద్రి జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్లు ఏజెన్సీ ప్రాంతంలోనే ఉన్న నేపథ్యాన మార్కెట్ కమిటీల్లో 1/70 చట్టం ప్రకారం గిరిజనులనే నియమించాలన్న వివాదం కోర్టులో కొనసాగుతోంది. దీంతో తొలిదశగా ఖమ్మం జిల్లాలోని మార్కెట్లకు పాలకవర్గాలను నియమించే అవకాశముంది. ఇందులో ఖమ్మం మార్కెట్‌కు ప్రాధాన్యత ఇస్తారని చెబుతున్నారు.

రహదారిపై యువకుల వీరంగం...

పాతకక్షల నేపథ్యాన ఇరువర్గాల దాడులు



రహదారిపై ఘర్షణ పడుతున్న యువకులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో రెండు వర్గాల మధ్య జరిగిన రణరంగాన్ని తలపించింది. అరుపులు, కేకలు, పరస్పర దాడులతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో మహిళలు సహా ఏడురికి తీవ్ర గాయాలయ్యాయి. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన చందు, గోపి, నవీన్, బాలరాజు ఆదివారం సాయంత్రం మండల కేంద్రం నుంచి గ్రామానికి వెళ్తున్నారు. ఈక్రమంలో చెరువు కట్ట వద్ద ఆగారు. ఇంతలోనే ముదిగొండ మండలంలోని గోకినేపల్లికి చెందిన పలువురు నేలకొండపల్లికి వస్తున్నారు. అయితే, వీరి నడుమ నెల 1వ తేదీన ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు ఎదురుపడగానే పాత గొడవ గుర్తుకొచ్చి పరస్పరం గొడవ పడుతూ కర్రలతో చితకబాదుకున్నారు. రహదారిపై వెళ్తున్న వారికి ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురికాగా, అడొచ్చిన మహిళపై కూడా దాడి చేశారు. ఇదేసమయాన నేలకొండపల్లి నుంచి ఆటోలో గువ్వలగూడెంకు వెళ్తున్న మహిళలు వెంకటరమణ, భవాని, మనీషా అక్కడ ఆగి గొడవను అడ్డుకునేందుకు యత్నం చేయగా వీరికీ గాయాలయ్యాయి. ఈమేరకు గువ్వలగూడెంకు చెందిన ఏడుగురు గాయపడగా నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయించగా, పోలీసులకు ఇరువర్గాల వారు ఫిర్యాదు చేశారు.

తిరుమలేశుడిని దర్శించుకున్న వైరా ఎమ్మెల్యే



స్వామి దర్శనం అనంతరం నాయకులతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆదివారం తిరుమలలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యేలు



గంగిరెద్దుకు చెరుకుగడ్డిని తినిపిస్తున్న ఎమ్మెల్యేలు, విజయ్‌బాబు

సత్తుపల్లి: డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు ఇంటి వద్ద ఆదివారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేయడంతో పాటు గంగిరెద్దుల విన్యాసాలు ప్రదర్శించారు. ల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ సంఖ్యలో వాహనాల్లో ఏపీలో కోడిపందేలను తిలకించడానికి బయలుదేరారు.

పెద్దమ్మతల్లికి భోగి పండ్లతో అభిషేకం

పాల్వంచరూరల్: భోగి పండగ సందర్భంగా ఆదివారం పాల్వంచ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి భోగిపండ్ల(రేగుపండ్లు)తో అభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈమేరకు అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు. కాగా, భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. అర్చకులు వారితో ప్రత్యేక పూజలు చేయించగా ఆలయ కమిటీ సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

డ్రోన్ దాడులను ఖండించండి

మావోయిస్టు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో సమత



మావోయిస్టులు విడుదల చేసిన డ్రోన్ దాడి ప్రాంత ఫొటో

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో పోలీసులు జరిపిన డ్రోన్ దాడులను ఖండించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ సౌత్ సబ్ జోనల్ బ్యూరో సమత ఆదివారం లేఖ విడుదల చేశారు. ఆదివాసీ గ్రామాలైన మెట్టగూడ, ఎర్రన్‌పల్లి, బొట్టెంతోగు గ్రామాల్లోని పొలాలు, ఇళ్ల సమీపాల్లో ఈనెల 13న పోలీసులు డ్రోన్‌ల ద్వారా పెద్ద ఎత్తున బాంబులు వేశారని, నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో పలు చోట్ల పెద్ద ఎత్తున అలజడి సృష్టించారని సమత పేర్కొన్నారు. ఇలాంటి దాడులను అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చాక అటవీ ప్రాంతాలపై దాడులు అధికమయ్యాయని, అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను దోచుకునే క్రమంలో అడ్డంకిగా ఉన్న ఆదివాసీలను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకే క్యాంపులు ఏర్పాటు చేస్తూ వేల సంఖ్యలో పోలీసులను మోహరింపజేస్తున్నారని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకెళ్లేందుకు అడవులను ధ్వంసం చేసి రోడ్లు, సెల్ టవర్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ గ్రామాలపై పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడం, అమాయకులను కొట్టడం, జైళ్లల్లో నిర్బంధించడం వంటి దుశ్చర్యలు సరైనవి కావని హితవు పలికారు. బీజాపూర్ జిల్లా మద్వేడి గ్రామంలో పోలీసు కాల్పుల్లో ఆరు నెలల పాప మృతి చెందగా, ఆమె తల్లికి గాయాలయ్యాయని, వైద్యం పేరుతో అదుపులోకి తీసుకొని జైల్లో బంధించారని విమర్శించారు. ఈ దాడులన్నీ సీఎం విష్ణుదేవ్‌సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ ఆదేశాల మేరకు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రజాప్రతినిధులు డ్రోన్ దాడులను ఖండించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఎంపీ పార్థసారధిరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



ఎంపీకి శుభాకాంక్షలు చెబుతున్న సండ్ర

సత్తుపల్లి: రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం కలిశారు. వేంసూరు మండలం కందుకూరులో ఎంపీని కలిసిన ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ పంచాయతీ పరిధి పాటివారిగూడెంకు చెందిన పి.ప్రవీణ్(25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మంలోని ఓ కళాశాల హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న ఆయన ఈనెల 12న ఇంటికి వచ్చాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగగా, కుటుంబీకులు చికిత్స కోసం ఖమ్మంలోని ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ప్రవీణ్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బైక్‌ను ఢీకొట్టి ఇంట్లోకి దూసుకెళ్లిన ట్యాంకర్



ఇంట్లోకి దూసుకెళ్లిన అమోనియం ట్యాంకర్

సత్తుపల్లిరూరల్: బైక్‌పై వెళ్తున్న అన్నాదమ్ములను ట్యాంకర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన సత్తుపల్లి మండలం తాళ్లమడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లికి చెందిన ముత్త సోయాత్‌కుమార్‌గుప్తా, ముత్తు ధన్విత్‌గుప్తా రామానగరంలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తాళ్లమడ వద్ద అమోనియం ట్యాంకర్ వీరి వాహనాన్ని ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. కాగా, ప్రమాదంలో ద్విచక్ర వాహనం ధ్వంసం కాగా, ఘటనకు ట్యాంకర్ అదుపు తప్పి పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లింది. ఆ సమయాన ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన బి.శ్రీకాంత్(30) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగాడు. కాసేపయ్యాక గుర్తించిన చుట్టుపక్కల వారు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. అయితే, శ్రీకాంత్ ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో వేర్వేరు చోట్ల నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడెం గ్రామ సమీపంలోని ఓ పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురినిఅరెస్ట్ చేసి రూ.9,300 స్వాధీనం చేసుకున్నారు. అశ్వారావుపేట సమీపంలోని మరో పామాయిల్ తోటలోని పేకాట స్థావరంపై కూడా దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరికొందరు పేకాటరాయుళ్లు పారిపోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి : మండలంలోని మూకమామిడి శివారులో ఆదివారం పోలీసులు దాడి చేసి కోడిపందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. మూడు కోడి పుంజులు, రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.



రాష్ట్ర సరిహద్దులో తనిఖీ చేపడుతున్న పోలీసులు

సరిహద్దులో పోలీసుల తనిఖీలు

అశ్వారావుపేటరూరల్: పండుగ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఏపీ, తెలంగాణ సరిహద్దులోని అశ్వారావుపేట మండలం పాపిగూడెం సమీపంలో ఆదివారం సీఐ కరుణాకర్, ఎస్‌ఐ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న 8మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, డిప్లొమా, B.Tech, M.Tech, D-Pharma, B-Pharma, B.Sc (Agri), B.Sc (Nursing), B.Ed, MBA, MCA Eligible for all Govt Jobs & Further Studies. Ph: 8866977112,339 [HA-14061]

■ ఖమ్మంలోని ప్రముఖ జూనియర్ కాలేజీకి మార్కెటింగ్ ఏజెంట్స్ (PRO's) ఈ క్రింది ప్రాంతాలలో కావలెను. కొత్తగూడెం, భద్రాచలం, చర్ల, సత్తుపల్లి, మరిపెడ బంగ్లా, తొర్రూరు సంప్ర. సెల్ : 88855 18151, 76750 97755. [M-2994]

Real Estate

HOUSE FOR SALE

■ ఖమ్మం, ఖానాపురం మెయిన్ రోడ్ దగ్గరలో (193 చదరపు గజాల ప్లాట్లు/221 చదరపు గజాల ఇల్లు విడిగా / మొత్తంగా అమ్మబడును. సంప్ర. 94419 58002, 92983 06564. [M-1167596]

■ కల్లూరు NSP క్రాస్ రోడ్ తిరుపతమ్మ గుడి బజారులో 5 సెంట్లలో ఉన్న 4 గదుల రేకుల ఇల్లు అమ్మకమునకు కలదు ✆ 89850 08459 [B-1336]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957
9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

Wanted

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1167593]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-8443]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.









ఇసుక బకాసురుడు చంద్రబాబు

తవ్వుకో.. తినుకో!

ఇసుక ఉచితమంటూ ఊడ్చేశారు • పచ్చ ముఠా లూటీ రూ.10 వేల కోట్లు

- గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు బేఖాతర్
- ఆర్థిక శాఖ ఆమోదం, మంత్రి మండలి తీర్మానం లేదు
- 'ప్రత్యేక మెమో'ముసుగులో యథేచ్ఛగా దోపిడీ
- ఏ1 పీతల సుజాత, ఏ 2 చంద్రబాబు, ఏ 3 చింతమనేని, ఏ 4 దేవినేని ఉమా
- నేడు పారదర్శక విధానాలతో ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం



సాక్షి, అమరావతి: ఇసుక నుంచి తైలం పిండటంలో నిజమెంత ఉందో తెలియదుగానీ ఇసుక నుంచి వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టవచ్చని చంద్రబాబు నిరూపించారు. అది కూడా ఇసుక ఉచితం అని బురిడీ కొట్టించి దోపిడీకి పాల్పడటం ఆయనకే సాధ్యమైంది. తాను అక్రమంగా నివాసం ఉంటున్న కరకట్ట ఇంటి వెనుకే వేల కొద్దీ లారీల్లో ఇసుక తరలిపోతున్నా గుడ్లప్పగించి చూశారు. టీడీపీ హయాంలో 'ఉచిత ఇసుక విధానం'ముసుగులో పచ్చ ముఠా సాగించిన దోపిడీని సీఐడీ పూర్తి ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. కేంద్ర చట్టాలు, గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలను ఉల్లంఘించి కేబినెట్ ఆమోదం కూడా లేకుండా 'ప్రత్యేక మెమో'ద్వారా చంద్రబాబు చేసిన లూటీ ఆధారాలతో బహిర్గతమైంది. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా చంద్రబాబు ముఠా ఏకంగా రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడిందన్నది నిగ్గు తేలింది.

అంతులేని ధన దాహం

2014లో టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు కన్ను ఇసుక రీచ్‌లపై పడింది. అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడినా ఆయన సంతృప్తి చెందలేదు. దీంతో ఇసుక విధానాన్ని పునఃసమీక్షించాలని కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. కొత్త ఇసుక విధానాన్ని నిర్ణయిస్తూ 2016 జనవరి 15న రెండు జీవోలు (జీవో నంబర్లు 19, 20) జారీ చేశారు. అయినప్పటికీ చంద్రబాబు ఇసుక దాహం తీరలేదు. బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడేందుకు మరో విధానాన్ని తీసుకురావాలని భావించారు. 'ఇసుకను ప్రభుత్వం అమ్మదు.. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు.. ఎవరికి వారు ఇసుక రీచ్‌లకు వెళ్లి ఇసుక తవ్వుకోవచ్చు.. అమ్ముకోవచ్చు.. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు, ఆంక్షలు విధించదు'అని చెబుతూ 2016 మార్చి 4న ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి దొరికిన చోట దొరికినట్లు దోచుకున్నారు. ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తన చేతిలోకి, మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకొచ్చారు.

ఏ1: పీతల సుజాత
(టీడీపీ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి)
ఏ2: నారా చంద్రబాబు
(టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)
ఏ3: చింతమనేని ప్రభాకర్
(టీడీపీ మాజీ ఎమ్మెల్యే)
ఏ4: దేవినేని ఉమామహేశ్వరరావు
(టీడీపీ ప్రభుత్వంలో జల వనరుల శాఖ మంత్రి)

ప్రధాన సెక్షన్లు ఇవీ...

చంద్రబాబు, ఇతర నిందితులపై నమోదు చేసిన సెక్షన్లు..
ఐపీసీ సెక్షన్లు 120 బి, 409 రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 (1) (డి) రెడ్‌విత్ 13 (2)

మూడు మార్గాలు బేఖాతర్..

భారీ ఇసుక దోపిడీ కోసం చంద్రబాబు అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. ఒక 'మెమో'తో ఇసుక దోపిడీకి పన్నాగం పన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడే ఇసుక తవ్వకాల కోసం విధానాలు రూపొందించాలి. అందుకు నిర్దేశించిన మూడు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒకటి ఎంపిక చేసుకోవాలి. ఇసుక తవ్వకాల కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రూపొందించిన బిజినెస్ రూల్స్ (మార్గదర్శకాలు) అనుసరించాలి. అంతకంటే మెరుగైన విధానం రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే ఆమేరకు ఆర్థిక శాఖ ఆమోదం పొందాలి. ఓ విధానాన్ని రూపొందించి అందుకు కేబినెట్ ఆమోదం పొందాలి. చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన 'ఉచిత ఇసుక విధానం'కోసం ఈ మూడింటిలో ఏ ఒక్కటీ పాటించలేదు.

మెమో 3066తో కనికట్టు

'ఉచిత ఇసుక విధానం'విధానాన్ని తెస్తూ టీడీపీ ప్రభుత్వం 2016 మార్చి 4న ప్రత్యేకంగా 'మెమో 3066'జారీ చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లన్నీ చంద్రబాబు, ఆయన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హస్తగతం చేసుకున్నారు. సహజ వనరులు, రాష్ట్ర ఖజానాకు కీలకమైన ఆర్థిక వనరుకు సంబంధించి కేబినెట్ ఆమోదం లేకుండానే అడ్డగోలుగా కేవలం ఒక మెమోను సాకుగా చూపి రంగంలోకి దిగారు. ఈ మెమో ద్వారా 2016 నుంచి 2019 వరకు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొట్టారు. రేట్లపై, తవ్వకాలపై నియంత్రణ లేదు. జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లలో ఎవరెవరు తవ్వుకోవాలో చంద్రబాబు స్వయంగా తన బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఒక్కసారిగా భారీ యంత్రాలను ఇసుక తవ్వకాల కోసం తెచ్చారు. ఇతరులు ఎవరూ ఆ ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా కట్టడి చేశారు. చంద్రబాబు ముఠా రోజూ వేల లారీల్లో లక్షల టన్నుల ఇసుకను తవ్వేసి అమ్ముకుంది. రాష్ట్రంలో నదుల్లో అందుబాటులో ఉన్న ఇసుక ఎంత..? రోజుకు ఎంత తవ్వుతున్నారు? ఎంతకు అమ్ముతున్నారు? ఎన్ని వేల లారీల ఇసుక రోజూ రాష్ట్రం దాటుతోంది? అనేదానికి అంతూపొంతూ లేకుండా పోయింది.

అడ్డుకున్న మహిళా అధికారి వనజాక్షిపై దాడి..

ఇసుక దోపిడీ కుట్రకు చంద్రబాబు సూత్రధారి కాగా అప్పటి గనుల శాఖ మంత్రి పీతల సుజాత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు మరికొందరు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించినందుకు తహ శీల్దార్ వనజాక్షిని టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుత్తు పట్టుకుని మరీ దాడికి పాల్పడ్డారు. తహశీల్దార్‌పై దాడికి పాల్పడిన తన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను నాటి సీఎం చంద్రబాబు సమర్థించడం విస్మయ పరిచింది. తమ ఇసుక దోపిడీకి అడ్డు వస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని సందేశం ఇచ్చేందుకే చంద్రబాబు అలా వ్యవహరించారు.

ఆ ఆదాయం ఏమైంది?



గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాల ద్వారా ఖజానాకు నాలుగు రకాల ఆదాయం రావాలి. సీనరేజీ, కన్సిడరేషన్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మైన్స్ ఫండ్, మెరిట్ ఫీజు చెల్లించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తెచ్చింది. దూరాన్ని బట్టి ఏ రీచ్ నుంచి ఎంత చార్జీ అనే అంశాన్ని నిర్ణయించి పారదర్శకంగా ప్రకటిస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ప్రకారం టీడీపీ హయాంలో 2016 నుంచి 2019 వరకు కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు రావాల్సి ఉంటుందని గనుల శాఖ అంచనా వేసింది. చంద్రబాబు 'ఉచిత ఇసుక'అనే మోసపూరిత విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల గండిపడింది. ఇక రాష్ట్రంలో యథేచ్ఛగా తవ్విన ఇసుక ఎంతనే అంచనాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 2016 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఠా రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఇసుకను తవ్వి అమ్మేసుకుందన్నది విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పక్కా ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాజ్యసభలో టీడీపీ అడ్రస్ గల్లంతే..

ఏప్రిల్ 2తో పూర్తికానున్న టీడీపీ సభ్యుడు 'కనకమేడల' పదవీకాలం

- వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి, బీజేపీ సభ్యుడు సీఎం రమేష్‌ల పదవీకాలం ముగిసేదీ అప్పుడే
- రాష్ట్ర కోటాలో ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చిలో ఎన్నికలు
- అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే
- దీంతో రాష్ట్ర కోటాలోని 11 స్థానాలు వైఎస్సార్‌సీపీ పరం



సాక్షి, అమరావతి: రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ వచ్చే మార్చి తర్వాత గల్లంతు కానుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ అంటే గత 41 ఏళ్లలో రాజ్యసభలో ఆ పార్టీకి సభ్యులు లేకపోవడం ఇదే తొలిసారి అవుతుంది. నిజానికి.. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు ఆ పార్టీని చేజిక్కించుకున్న తర్వాత తెలుగుదేశం క్రమంగా ప్రాభవం కోల్పోతూ వస్తోంది. ఈ నేపథ్యంలో.. త్వరలో ఖాళీకానున్న మూడు రాజ్యసభ స్థానాలూ అసెంబ్లీలో సంఖ్యా బలం ద్వారా వైఎస్సార్‌సీపీకే కైవసం చేసుకుంటుంది. దీంతో రాజ్యసభలో టీడీపీ తొలిసారిగా కనుమరుగు కావడం ఖాయం.

రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతమున్న సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని ఆయా రాష్ట్రాల శాసనసభ్యులు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. ఇక రాజ్యసభలో 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 శాసనసభ స్థానాల్లో ఘనవిజయం సాధించగా.. టీడీపీ 23 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని మచ్చిక చేసుకుని కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేశ్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు పావులు కదిపారు. ఇక రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. నాడు అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఎనిమిది రాజ్యసభ స్థానాలు ఆ పార్టీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని సీఎం వైఎస్ జగన్ దేశానికి చాటిచెప్పారు.

ఆ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే..

ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 2 నాటికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వైఎస్సార్‌సీపీ), సీఎం రమేష్ (బీజేపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ)ల పదవీకాలం పూర్తికానుంది. ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేయనుంది. రాజ్యసభకు ఎన్నికకు కావాలంటే 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ప్రస్తుతం శాసనసభలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే.. ఈ మూడు స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం ఖాయం. దీంతో రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ బలం 11కు చేరనుంది. అంటే రాష్ట్ర కోటాలో సీట్లన్నీ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే చేరుతాయి. టీడీపీ ఉనికే లేకుండాపోతుంది.

రేపు శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. అదేరోజు గోదాపరిణయోత్సవం విశేషంగా జరుగనుంది. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయ్యర్‌స్వామి మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకు వెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ కృష్ణస్వామివారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. కాగా, పార్వేట ఉత్సవం కారణంగా ఈ నెల 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

జిల్లా వార్తలు

ఓయూ మహిళా క్రికెట్ జట్టులో ఖమ్మం క్రీడాకారులు



ఓయూ జట్టుకు ఎంపికైన క్రికెటర్లు

ఖమ్మం స్పోర్ట్స్: ఉస్మానియా యూనివర్సిటీ మహిళా క్రికెట్ జట్టులో ఖమ్మం క్రీడాకారులకు స్థానం లభించింది. ఈ జట్టు కెప్టెన్‌గా ఖమ్మంకు చెందిన అంజలి వ్యవహరిస్తుండగా సభ్యురాలిగా నవీన ఎంపికైంది. వీరిద్దరు హైదరాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గురుకులం కళాశాలలో చదువుతున్నారు. ఓయూ జట్టు ఈ నెల18నుంచి 22 వరకు అళగప్ప యూనివర్సిటీ ఆధ్వర్యాన జరిగే సౌత్ ఇండియా యూనివర్సిటీ క్రికెట్ టోర్నీలో పాల్గొననుంది. కాగా, ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని నెట్స్‌లో ప్రాక్టీస్ చేసే క్రికెటర్లు ఓయూ జట్టుకు ఎంపిక కావడంపై డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, కోచ్ ఎం.డీ.మతిన్, మాధవీలత, దీప్తి, శ్రీదేవి తదితరులు అభినందించారు.

ఆయిల్‌పామ్ తోటను పరిశీలించిన అధికారులు




మొక్కలను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, తదితరులు

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం నారాయణపురంలోని కాత రాని ఆయిల్‌పామ్ తోటలను ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయిల్‌ఫాం రాష్ట్ర కన్సల్టెంట్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు పుచ్చకాయల సోమిరెడ్డి, రమేష్‌రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పలు మొక్కల మొదళ్లను తెగుళ్లు ఆశించి సుమారు 100 మొక్కల వరకు చనిపోయినట్లు గుర్తించారు. ఇప్పటికే రూ.48 లక్షల మేర నష్టపోయామని రైతులు ఆయనకు తెలిపారు. అయితే, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి ఇప్పించడమే కాక పరిహారంపై ఎండీ దృష్టికి తీసుకెళ్తానని రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫీల్డ్ ఆఫీసర్లు కృష్ణారావు, అప్పారావు, సతీష్, ఎంపీటీసీ తుంబూరు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బూడిదవుతున్న బొగ్గు

- కేటీపీఎస్ కోల్ స్టాకర్‌లో నిత్యం మంటలు
- విద్యుదుత్పత్తికి వినియోగించాల్సిన బొగ్గు అగ్నికి ఆహుతి
- జెన్‌కోకు కోట్ల రూపాయల నష్టం
- మంటలు అదుపు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం



కోల్ యార్డులో మండుతున్న బొగ్గు



కోల్ యార్డులో కాలుష్యం వెదజల్లుతున్న పొగ

పాల్వంచ : కేటీపీఎస్ కోల్ ప్లాంట్‌లో బొగ్గు నిలవ్వలపై అధికారుల పర్యవేక్షణ కరువవుతోంది. యార్డుల్లో నిల్వ ఉన్న బొగ్గు నిత్యం అగ్నికి ఆహుతి అవుతుండడంతో జెన్‌కో సంస్థకు తీరని నష్టం వాటిల్లుతోంది. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించాల్సిన బొగ్గు స్టాకర్ ఏరియాలో అనుకోని విధంగా మంటలకు గురై బూడిద పాలు అవుతోంది. దీంతో బొగ్గు నిల్వలపై ప్రభావం పడుతోంది. బొగ్గు వృథా కావడమే కాక, అక్కడ ఇతర విభాగాల్లో పనిచేసే సిబ్బంది సైతం అధిక కాలుష్యానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా కోల్ ప్లాంట్ అధికారులు, ఫైర్, సేఫ్టీ విభాగాల అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిత్యం మంటలే..

కేటీపీఎస్ 5, 6, 7 దశల కర్మాగారాల్లో 1,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం కావడంతో బొగ్గు, నీటితో ఉత్పత్తిని జనరేట్ చేస్తుంటారు. సింగరేణి నుంచి రైల్వే వ్యాగన్‌ల ద్వారా నిత్యం కేటీపీఎస్ స్టాకర్ ఏరియా కోల్‌యార్డ్‌ల్లో బొగ్గు దిగుమతి చేస్తుంటారు. ఇలా నిల్వ చేసిన బొగ్గు 5, 6 దశల కర్మాగారంలో ఇటీవల నిత్యం మంటలకు గురవుతు కాలి బూడిదవుతోంది. అక్కడ ప్రస్తుతం 1.60 లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉంది. బొగ్గును బంకర్ల ద్వారా పంపించి మండించి విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. బొగ్గు 4,500 కెలోరిసిస్ వ్యాల్యూతో ఉండటం, బంకర్లకు నెట్టే క్రమంలో ఫైర్ క్యాచ్ అయి మంటలు వ్యాపిస్తుంటాయి. లేదంటే అక్కడ ఎవరైనా నిప్పంటించినా ఇలా జరిగే ప్రమాదం ఉంటుంది. స్టాకర్ ఏరియాలో ఇలా భారీ ఎత్తున బొగ్గు నిల్వలు అగ్నికి ఆహుతి అవుతుండటం పరిపాటిగా మారింది.

కాలుష్యం బారిన సిబ్బంది..

కోల్ స్టాకర్ ఏరియాలో బొగ్గు నిల్వలు నిత్యం కాలుతుండడంతో ఆ ప్రాంతమంతా పొగ అలుముకుని విపరీతమైన కాలుష్యం వెలువడుతోంది. దీంతో ఆ ఏరియాలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే కర్మాగారాల్లో పనిచేసే సిబ్బంది అనేక శ్వాసకోశ, ఇతర ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నా అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. స్ప్రింక్లర్లతో నిత్యం నీళ్లు చల్లి మంటలను ఎప్పటికప్పుడు అదుపులోకి తీసుకురావాల్సి ఉండగా కోల్ ప్లాంట్, సేఫ్టీ, ఫైర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. కార్మికులు సైతం సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో సమస్య ఉత్పన్నం అవుతూ జెన్‌కోకు రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి పర్యవేక్షణ చేయాలని, బొగ్గు వృథా కాకుండా సంస్థ ప్రయోజనాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మంటలపై చర్యలు చేపడుతున్నాం



బొగ్గు నిల్వలు మంటలకు గురవుతుండడం సహజం. బొగ్గు 4,500 కెలోరిసిస్ వ్యాల్యూతో ఉంటుంది. బంకర్లకు నెట్టే క్రమంలో మంటలు వచ్చే అవకాశం ఉంది. వీటిని ఎప్పటికప్పుడు ఆర్టిజన్ కార్మికులతో స్ప్రింక్లర్ల ద్వారా నీరు చల్లిస్తున్నాం. నిత్యం అధికారులు పర్యవేక్షించేలా చర్యలు చేపడుతున్నాం.
– ఎం.ప్రభాకర్ రావు, కేటీపీఎస్ 5, 6 దశల సీఈ

గ్రామీణ వైద్యుడి ఔదార్యం

వలస కూలీలకు సంక్రాంతి విందు



కూలీలకు భోజనం వడ్డిస్తున్న అఖిల్, తదితరులు

ఇల్లెందురూరల్: ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు పలువురు ఇల్లెందు మండలంలో మిర్చి ఏరివేత పనులు చేస్తున్నారు. సంక్రాంతి వేడుకలను ప్రజలంతా సంబురంగా నిర్వహించుకుంటుండగా.. వారు ఆదివారం కూడా పనిలో నిమగ్నమయ్యారు. ఈక్రమాన పోచారంతండా గ్రామీణ వైద్యుడు అఖిల్ అహ్మద్, మరికొందరు కలిసి 180 మంది వలస కూలీలకు విందు భోజనం ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో జగదీష్, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారంతో పాటు పండుగ రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 880 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.30,880, 250 మంది బోటు షికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.29,250 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు



ఉత్కంఠగా సాగుతున్న వాలీబాల్ పోటీ

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి కొల్లాపురంలో యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యాన మూడు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ గ్రామంలో 47ఏళ్లుగా పోటీలు నిర్వహిస్తుండడం విశేషం. ఈ పోటీలను సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా పేరొందిన వాలీబాల్‌కు గ్రామంలో 47 ఏళ్లకు ముందు నుంచే ఆదరణ ఉందని తెలిపారు. అప్పటి పెద్దల స్ఫూర్తితో ప్రతిఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల స్థాయి పోటీల నిర్వహణలో గ్రామంలోని ప్రతీ కుటుంబం భాగస్వామ్యమవుతోందని తెలిపారు. అంతేకాక కొల్లాపురం స్ఫూర్తితో పరిసర గ్రామాల్లోనూ వాలీబాల్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందని వెల్లడించారు. తొలుత సంక్రాంతి సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు తిలకించారు. గ్రామపెద్దలు చీమల రాంమ్మూర్తి, బొర్ర భద్రం, మండల వెంకన్న, పెద్దబోయిన హేమలత, కుంజ రాంచందర్, బుగ్గ వెంకటేశ్వర్లు, రావూరి ఉపేందర్, ఆదినారాయణ, కోడి శ్రీను, మోకాళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించే క్రీడలు

ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న గుమ్మడి నర్సయ్య, నాయకులు

కారేపల్లి: క్రీడలు మానసికోల్లాసంతో పాటు, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని.. ఈ విషయాన్ని గుర్తించి అందరూ క్రీడలపై దృష్టి సారించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సూచించారు. కారేపల్లి మండలం టేకులగూడెంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, ప్రజా సంఘాల ఆధ్వర్యాన సంక్రాంతి సందర్భంగా శనివారం ముగ్గుల పోటీలు, క్రికెట్, వాలీబాల్ క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే నర్సయ్య మాట్లాడుతూ సమాజంలో విష సంస్కృతి, అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, పేదరికం, మోసాలు, స్త్రీలపై అత్యాచారాలు పెరిగి శ్రమ సంస్కృతి మరుగున పడిందని తెలిపారు. ఈమేరకు యువత సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సర్పంచ్ సూర్ణపాక అనసూయతో పాటు ప్రజాపంథాతో పాటు వివిధ సంఘాల నాయకులు ఆవుల అశోక్, ఆజాద్, ఎన్.వీ.రాకేష్, గుమ్మడి సమ్మయ్య, పాపయ్య, రామారావు, తేజ్యా, భాస్కర్, సరోజిని, రంగయ్య, పాపారావు, నాగయ్య, పవిత్ర, చైతన్య, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో ఏపీ న్యాయమూర్తి పూజలు



రామాలయంలో న్యాయమూర్తి శ్రీనివాసరావు, కుటుంబం

దుమ్ముగూడెం మండలం పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరానికి చెందిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.పవన్‌కుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన న్యాయమూర్తిని ఆలయ అర్చకులు సంప్రదాయ రీతిలో స్వాగతించి ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే, ఆలయ విశిష్టతను వివరించారు. – చర్ల